# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-11-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. మైనారిటీ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**2. జాతీయ వాటర్‌షెడ్ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

**3. ఆంధ్రప్రదేశ్ లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.**

**4. తెలంగాణలో తుఫాను కారణంగా జరిగిన పంట నష్టం కింద ఎకరానికి 10 వేల రూపాయల చొప్పున పరిహారం అందిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.**

**5. పబ్లిక్ సర్వీస్ బ్రాడ్‌కాస్టింగ్ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

మైనారిటీ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భారతరత్న మౌలానా అబుల్ కలామ్ అజాద్ జయంతిని పురస్కరించుకుని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గత సాయంత్రం నిర్వహించిన మైనారిటీ సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. 2025-26 బడ్జెట్‌లో మైనారిటీల సంక్షేమానికి 5 వేల 434 కోట్ల రూపాయలు కేటాయించామని ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు పేర్కొంటూ,

వాయిస్..27 సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు అన్నమయ్య జిల్లాలో పర్యటిస్తారు. ఇందులో భాగంగా జిల్లాలోని చిన్నమండెం మండలం దేవగుడిపల్లిలో ప్రభుత్వం నిర్మించిన ఇళ్ళ గృహప్రవేశాల కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదికలో పక్కాగృహాల లబ్ధిదారులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహిస్తారు. అనంతరం సోషల్ మీడియా ప్రతిభావంతులతో ముచ్చటిస్తారని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు.

---

నీటి వనరుల సంరక్షణకు ఉపయోగపడే జాతీయ వాటర్‌షెడ్ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులో వాటర్‌షెడ్ మహోత్సవంపై రెండురోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన నిన్న ప్రసంగించారు. గ్రామాలకు భూమి, నీరు ముఖ్య వనరులని తెలిపారు. వాటర్‌షెడ్ కార్యక్రమం ద్వారా ప్రజలకు నీటి వనరుల సంరక్షణతోపాటు, వాటి పరిసర ప్రాంతాల్లో ఆహ్లాదాన్ని, వినోదాన్ని కలిగించేలా ఏర్పాట్లు చేస్తున్నామని కేంద్రమంత్రి పేర్కొంటూ,

వాయిస్.. 35 సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో నిర్వహించనున్న భారత పరిశ్రమల సమాఖ్య–సీఐఐ సదస్సు భద్రతా ఏర్పాట్లపై పోలీస్ ఉన్నతాధికారులతో హోం మంత్రి వి.అనిత నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రముఖులు, ప్రతినిధులు ఉండే హోటళ్ల వద్ద భద్రతపై దృష్టి పెట్టాలన్నారు. విశాఖ నగరం డ్రోన్, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటుందని, ఎస్ఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉండాలని సూచించారు. సదస్సు నిర్వహణకు శాఖల మధ్య సమన్వయం ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్కే బీచ్, తెన్నేటి పార్కు, రుషికొండ తీరాల్లో గజఈతగాళ్లను సిద్ధంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు ముందుగా తెలియజేయాలని హోమంత్రి మార్గనిర్దేశం చేశారు.

---

ఆంధ్రప్రదేశ్ లో 51 లక్షల మెట్రిక్ టన్నుల దాన్యం కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఏలూరు జిల్లా చింతలపూడిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల వ్యవధిలోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ ..30 సెకన్లు

---

తెలంగాణలో మొంథా తుపాను కారణంగా జరిగిన పంట నష్టం కింద ఎకరానికి 10 వేల రూపాయల చొప్పున పరిహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయశాఖ నివేదికపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'తుఫాను ప్రభావిత జిల్లాలలో వ్యవసాయశాఖ అధికారుల బృందం చేసిన సర్వేలో లక్షా 17 వేల 757 ఎకరాలలో పంటలకు నష్టం జరిగిందని తెలిపారు. 27 జిల్లాలలోని లక్షా 22 వేల 142 మంది రైతులకు చెందిన పంట నష్టాలను వ్యవసాయశాఖ అధికారుల బృందం గుర్తించిందని చెప్పారు.పంట నష్టాలపై వ్యవసాయ శాఖ ఇచ్చిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపి పరిహారం కోరతామని మంత్రి తెలిపారు.

---

అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, నివారణ కార్యక్రమం 4.0 –ఎన్సీడీ ద్వారా ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో 39 లక్షల మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. 'మహిళలకు నోటి, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు జరుగుతున్నాయని, వారిలో అనుమానిత లక్షణాలు కలిగిన వారిని చికిత్స కోసం ఆయా జిల్లాల్లోని బోధనాసుపత్రులకు పంపుతున్నామన్నారు. క్యాన్సర్ గుర్తింపు స్క్రీనింగ్ చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను ఆదేశించామని పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంచాలని, సిబ్బందికి పునశ్చరణ తరగతులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

---------------------------

పబ్లిక్ సర్వీస్ బ్రాడ్‌కాస్టింగ్ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. అహింసా మార్గాన్ని ఎంచుకుని భారతదేశ స్వాతంత్ర్య సముపార్జనలో ముఖ్య భూమిక పోషించిన మహాత్మా గాంధీ 1947వ సంవత్సరం నవంబర్ 12వ తేదీన తొలిసారి ఢిల్లీలోని ఆకాశవాణి కేంద్రాన్ని సందర్శించారు. గాంధీజీ ఆకాశవాణి కేంద్రాన్ని సందర్శించిన ఆ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా నవంబర్ 12వ పబ్లిక్ సర్వీస్ బ్రాడ్‌కాస్టింగ్ దినోత్సవాన్ని పాటిస్తున్నారు.

---------------------------

తెలంగాణలో మత్స్యకారుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ 123 కోట్లరూపాయలతో ఉచిత చేపపిల్లల పంపిణీ పథకాన్ని అమలు చేస్తున్నామని మత్స్యశాఖ మంత్రి వి. శ్రీహరి తెలిపారు. హైదరాబాద్ లో నిర్వహించిన ప్రపంచ ఆక్వాకల్చర్–2025 సదస్సుకు ఆయన నిన్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేపపిల్లలను సొంతంగా పంపిణీ చేసేందుకు వీలుగా ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, ఉచిత పంపిణీ పథకం అవసరాలకు వాటినే వినియోగిస్తామని చెప్పారు. మధ్యాహ్న భోజనం పథకంలో చేపలను ఆహారంగా చేర్చే అంశంపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని 5 లక్షల మంది మత్స్యకారులకు 1.40 లక్షలతో బీమా పథకం చేపట్టామని మంత్రి శ్రీహరి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ యానాం, దిగువ ట్రోపో ఆవరణంలో ఉత్తర ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో చలిగాలులు వీస్తున్నాయని, పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టే అవకాశముందని తెలిపింది.

మరోవైపు.. తెలంగాణాలో చలిగాలులు వీస్తున్నాయని, రానున్న మూడు రోజులపాటు చలి తీవ్రత పెరిగే అవకాశముందని, పలు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================